రమ భర్త పోయాడని తెలియగానే నిర్ఘాంత పోయాను. మనసు అదోలా అయిపోయింది. కొద్దిసేపటికి తేరుకున్నాను.

రమ నా ప్రాణస్నేహితురాలు. ఒకే ఊళ్ళో పుట్టిపెరిగాము. మా ఇళ్ళు కూడా బాగా దగ్గరే. ఒకే స్కూల్లో చదివాము. రోజూ స్కూల్‌కి



# ఆదర్శం

కలిసెళ్ళి కలిసొచ్చేవాళ్ళం. ఇంటర్ దాకా మా జంట విడిపోలేదు. తరువాత వాళ్ళ నాన్నగారి ఉద్యోగరీత్యా మేము విడిపోవలసి వచ్చింది. రెగ్యులర్‌గా ఉత్తరాలు రాసుకునేవాళ్ళం.

మళ్ళీ మా పెళ్ళిళ్ళలో కలుసుకున్నాం. తరువాత కూడా మా మధ్య ఉత్తరాలు కొంతకాలం సాగాయి. కానీ కొంతకాలమయ్యేసరికి సంసార బాధ్యతలు, పిల్లలు కలగడం, వాళ్ళతో తాపత్రయాలు... వీటితో ఉత్తరాలు తగ్గిపోయాయి. సంవత్సరానికొకసారి గ్రీటింగ్ కార్డ్స్‌తో నూతన సంవత్సర శుభాకాంక్షలు పంపుకోడంతో తృప్తి పడేవాళ్ళం. లాంఛనప్రాయంగా గ్రీటింగ్ కార్డ్ పంపుకోవడంతో సరిపుచ్చుకోక ప్రతి ఏడూ పూర్తి వివరాలతో ఒక పెద్ద ఉత్తరం రాసుకునేవాళ్ళం. రమకు ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల. నాకు ఇద్దరూ మొగపిల్లలే. రమ కొడుకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక రీసెర్చ్ చేసేందుకు అమెరికా వెళ్ళి, అది పూర్తిచేసి అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు. అక్కడే సెటిలయిన కుటుంబంలోని పిల్లను పెళ్ళి చేసుకొని అక్కడే స్థిరపడిపోయాడు. పెళ్ళి మాత్రం ఇండియా వచ్చి చేసుకొని వెళ్ళిపోయాడట. ఆడపిల్లకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయ్యాక పెళ్ళిచేసారు. ఆ అమ్మాయి భర్తతో ఢిల్లీలో ఉంటోంది.

రమ భర్త కిందటి సంవత్సరమే రిటైరయ్యాడు. భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లో స్వంత ఇంట్లో ఉంటున్నారు. ఇదుగో ఇప్పుడు రమ దగ్గర్నుంచి పిడుగులాంటి ఈ ఉత్తరం. రమ ఎలా ఉందో... పన్నెండు రోజుల కర్మ పూర్తయి, బంధువులందరూ వెళ్ళిన తరువాత ఈ ఉత్తరం రాసింది. ఉత్తరంలో ఎక్కువ వివరాలు లేవు. గుండెజబ్బు వచ్చి అకస్మాత్తుగా పోయాడట. కూతురు వెంటనే వచ్చిందట. కానీ కొడుకు మాత్రం తొమ్మిదో రోజుకు గానీ రాలేకపోయాడట.

రమ చాలా ధైర్యస్థురాలు. మాటలలోనూ, చేతల్లో కూడా చదువుకునే రోజుల్లో ఎన్నోసార్లు తన ధైర్యాన్ని చూసే అవకాశం నాకు కలిగింది. నేను చాలా పిరికిదానిని. ప్రతిచిన్న విషయానికీ భయపడే దాన్ని. రమ నాకు ధైర్యం చెప్పి భయం పోగొట్టేది. కానీ ఎంత ధైర్యస్థురాలయినా ఇలాంటి సమయంలో ఆత్మీయుల సానుభూతి, సహాయం అవసరం.

నేను వెళ్ళి రమను కలవాలి, ధైర్యాన్ని అందించాలి. రమకు ఫోన్ చేసి వెంటనే బయలుదేరాను. కొట్టుకుంటున్న గుండెలతో డోర్ బెల్ నొక్కాను. రమ వచ్చి తలుపు తీసింది. ఎదురుగా నిలబడి ఉన్న రమ ముఖం చూసి ఆశ్చర్యపోయాను. నుదుట పెద్ద ఎర్రటి బొట్టు. స్టన్ అయిపోయి అలా చూస్తూ నిలబడిపోయాను. నేను ఊహించుకున్న రమ ముఖం వేరు.

నా పరిస్థితిని గమనించి రమే ముందు పలకరించింది. "ఏమిటలా కొత్తదాన్ని చూస్తు


**మ. రుక్మిణీ గోపాల్**

న్నట్టు చూస్తున్నావు. నేను రమనే" అంది లేని చిరునవ్వుని తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ. తేరుకున్నాను. దుఃఖాన్ని ఆశ్చర్యం ఆపేసింది. "రమా..." అంటూ కన్నీళ్ళతో కౌగిలించుకున్నాను.


"ఉండు... లోపలికెళదాం" అంటూ నా చేయిపుచ్చుకుని హాల్లోకి తీసుకువచ్చింది. ఇద్దరం సోఫాలో పక్కపక్కనే కూర్చున్నాం. అంతదాకా నొక్కిపట్టి ఉంచిన రమలోని దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది. "ఒక్క రోజులో నా జీవితం మారిపోయింది సీతా" అంటూ నన్ను గట్టిగా కౌగిలించుకుని భోరుమంది. నాకూ ఏడుపాగలేదు.

కొంచెం తేరుకున్నాక "ఏమిటీ, ఏం జరిగింది, ఎలా జరిగింది?" అంటూ వివరాలడిగాను. అన్నీ వివరంగా చెప్పింది. రాత్రి ఎప్పుడో నిద్రలో 'మాసివ్ ఎటాక్' వచ్చి ప్రాణం పోయిందట. పక్క మంచం మీద పడుకున్నా, తెల్లారి లేచి చూసేదాకా తనకే తెలియలేదట. ఏమాత్రం వైద్య సహాయం లేకుండా మరణించారు అని బాధపడింది.

వార్త అందగానే కూతురు వెంటనే వచ్చి తండ్రి శవాన్ని చూడగలిగిందట. కానీ కొడుకు తొమ్మిదో రోజుగానీ రాలేకపోయాడట. కొడుకొక్కడే వచ్చాడట. కోడలు రాలేదు. ఆమె కూడా ఉద్యోగస్తురాలే. సెలవు దొరకలేదట. కొడుకు 14వ రోజుదాకా ఉండి వెళ్ళిపోయాడట. అంతకన్నా సెలవు దొరకలేదట. వెళ్తూ తనను కూడా రమ్మన్నాడట. తను ఇప్పుడు కాదు, తర్వాత చూద్దాంలే అందిట. కూతురు ఇంకో నాలుగు రోజులుండి వెళ్ళిపోయిందట. పిల్లల చదువుల మూలాన అంతకన్నా ఎక్కువ ఉండేందుకు ఆ అమ్మాయికి కుదరలేదట. బాధపడుతూ వెళ్ళిందట. రమ చెబుతున్నది వింటూనే ఉన్నా అస్తమానూ నా దృష్టిని మరల్చుకోలేకపోతున్నాను.



కృష్ణా జిల్లా రచయితల సంఘం అధికారిక వెబ్‌సైట్ 'తెలుగు పసిడి డాట్‌కామ్' ని విజయవాడలో ఆవిష్కరిస్తున్న ప్రస్తుత రాష్ట్ర పశు సంవర్థక శాఖ, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖామాత్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్




రమ గ్రహించినట్టుంది. "ఏవిటీ, నేను బొట్టెందుకు తీసేయలేదని అనుకుంటున్నావా?" అంది చిన్నగా నవ్వుతూ. నేను కొంచెం సిగ్గుపడ్డాను. ఏం మాట్లాడలేక పోయాను. "ఏం, భర్త పోతే బొట్టెందుకు తియ్యాలి? అది భర్తతో వచ్చింది కాదు కదా? అంచేత ఆఖరికి నేను బొట్టు సైజు కూడా తగ్గించలేదు" అంది.

ఈ విషయంలో రమ ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. "బొట్టు తీసేయడమే భర్త పోయిన దుఃఖానికి నిదర్శనమనుకుంటున్నావా? బ్రతికున్నప్పుడూ, పోయిన తర్వాత కూడా ఆయన స్థానం నా హృదయంలో ఉంది. నా నుదిటి మీద లేదు. ఆయన పోయినా బొట్టు పెట్టుకోవడం చనిపోయిన ఆయనను అగౌరవపరచడం అని నేననుకోవడం లేదు. పుట్టిననాటి నుంచీ బొట్టు పెట్టుకుంటున్నాను. ఇప్పుడూ పెట్టుకుంటున్నాను. నీకు ఇంకొక్క విషయం చెప్పాలి. పూజామందిరంలో ఆయన ఫొటో పెట్టుకున్నాను. రోజూ దేవుడికి దీపం పెట్టి పువ్వులు వేసేటప్పుడు ఆయన ఫొటో దగ్గర కూడా పువ్వులు పెట్టి అగరొత్తులు వెలిగిస్తాను" అంది రమ కొంచెం విచారంగా.

"రమా! నన్ను తప్పుగా అర్థం చేసుకోకు. చనిపోయిన వ్యక్తి మీదున్న నీ ప్రేమాభిమానాల్ని నేను శంకించడం లేదు. కానీ ఈ వార్త విన్నాక నేను ఊహించుకున్న రమ ముఖం వేరు. 'ఆ ముఖాన్ని ఎలా చూడగలనా?' అని బాధపడ్డాను. అంచేత కొంచెం తొట్రుపడ్డాను. నిజానికి నిన్నిప్పుడిలా చూడటం చాలా సంతోషంగా ఉంది."

వంట మనిషి ఇడ్లీ తెచ్చిచ్చింది. ఆ తర్వాత కాఫీ తెచ్చిపెట్టింది. కబుర్లలో పడ్డాం. "రమా, ఇప్పుడు ఏం చేయదల్చుకున్నావు? ఒంటరిగా ఉండటం కష్టం కదా! కొడుకు దగ్గరకు వెళ్ళిపోతావా?" అడిగాను.

"వెళ్ళను" అంది దృఢంగా.

దాని స్వరంలోని నిశ్చింతకి నేను ఆశ్చర్య పోయాను. "ఒక్కతెవూ ఎలా ఉంటావే?" అన్నాను కొంచెం ఆవేదనగా. "మీ అబ్బాయి రమ్మన్నాడు కదా. పోనీ వెళ్ళకూడదూ? మనవలతో హాయిగా కాలక్షేపమవుతుంది." అన్నాను.

రమ నవ్వింది. "ఓసి పిచ్చి సీతా, ఇంత వయసొచ్చినా నీకు లోకం పోకడ తెలియదు. స్కూల్ రోజుల్లో మన క్లాస్‌మేట్ సుభద్ర జ్ఞాపకం ఉందిగా... అది ఈ ఊర్లోనే ఉంది. ఓ రోజున అనుకోకుండా కలుసుకున్నాం. అప్పట్నుంచీ మాకు రాకపోకలు బాగానే సాగేవి. నాలుగేళ్ళ క్రితం దాని భర్తపోయాడు. కొడుకూ కోడలూ చాలాసార్లు రమ్మని అంటే, ఓ ఏడాది దాటిం తర్వాత స్వంత ఇల్లు కూడా అమ్మేసుకుని కొడుకు దగ్గరకు వెళ్ళింది. ఇల్లమ్మిన డబ్బుతో కొడుకక్కడ ఫ్లాట్ కొనుక్కున్నాడట. వెళ్ళిన కొత్తలో కొన్నాళ్ళు బాగానే చూసారట. తరువాత షరా మామూలే. చివరకు భరించలేక మళ్ళీ ఈ ఊరు వచ్చేసింది. ఓ చిన్నగది అద్దెకు తీసుకొని, పెన్షన్ డబ్బుతో ఒంటరిగా బ్రతుకుతోంది" అంటూ చెప్పుకొచ్చింది.

నాకేమనాలో తోచలేదు. "ఆ... అందరూ అలా ఉంటారా?" అన్నాను.

"నూటికి తొంభై తొమ్మిది మంది కొడుకులు అలాగే ఉంటారు. ఆ ఒక్క పర్సెంట్ కూడా అనుమానమే. అంచేత ఒంటరిగానే బ్రతకదల్చుకున్నాను" అంది దృఢ నిశ్చయంతో.

"ఒక్కతెవూ ఎలా ఉండగలవే?" అన్నాను ఆవేదనగా.

"ఉండాలి. తప్పదు. నా అనేవాళ్ళు దగ్గర లేకుండా ఒంటరిగా బ్రతకడం కష్టమే. కానీ అదృష్టమలా ఉన్నప్పుడు ఎవరేం చెయ్యగలరు? ఈ రత్తమ్మగారు చాలా రోజుల్నుంచి మా ఇంట్లో పనిచేస్తున్నారు. మంచి మనిషి. ఎదిగిన పిల్లలు. అంచేత ఆమెకు తన ఇంట్లో ఎక్కువ బాదరబందీ లేదు. అభిమానంతో నన్ను కనిపెట్టుకుని ఉంటోంది. భగవంతుని దయవల్ల డబ్బుకి కొదవలేదు. ఇక్కడ నాకు స్నేహ బృందం ఎక్కువే ఉంది. అందరూ అన్నిటికీ నన్ను పిలుస్తారు. అందరూ ఆధునిక భావాలు కలవారు. భర్త పోయినంత మాత్రాన నన్ను వేరే వ్యక్తిలా చూట్టం లేదు. మునపటిలాగే చూస్తున్నారు."

రమ గుండె ధైర్యాన్నీ, తన చుట్టూ ఆమె నిర్మించుకున్న చిన్న ప్రపంచాన్నీ ప్రశంసించకుండా ఉండలేకపోయాను. కానీ ఒక అనుమానం నన్ను బాధించసాగింది. "ఏ అర్ధరాత్రో అకస్మాత్తుగా జబ్బుపడితే ఏం చెయ్యగలవు?" అన్నాను.

"నేను లేవలేని పరిస్థితిలో మా పొరుగింటికి ఫోన్ చేస్తే వెంటనే వచ్చేంత అభిమానం నాపట్ల వారికుంది. మా అబ్బాయి, అమ్మాయీ ఫోన్ నెంబర్లు వాళ్ళకిచ్చాను. అకస్మాత్తుగా ఏదైనా జరిగితే వాళ్ళకి తెలియపర్చేందుకు." అంది.

రమ దగ్గర రెండు రోజులుండి తిరిగి మా ఊరు బయల్దేరాను. రైల్లో కిటికీ ప్రక్కన కూర్చుని రమ గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. భర్తపోగానే ఒంటరితనాన్ని భరించలేక, మమకారాన్ని చంపుకోలేక కొడుకుల పంచన చేరి, జీవితాల్ని నరకప్రాయం చేసుకుంటూ, వారి దయాధర్మాల మీద ఆధారపడి జీవచ్ఛవాల్లా ఎందరో బ్రతుకును వెళ్ళదీస్తున్నారు. రమలా ఎందరు ఆలోచించగలరు? వారందరికీ రమ ఆదర్శప్రాయం అన్పించింది. ●